ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 8 ఆగస్టు 2025

నేడు వరలక్ష్మీ వ్రతం

అమ్మవారి ఆలయాల్లో ఏర్పాట్లు


టి.నగర్ రంగనాథన్ వీధిలో రద్దీ

● జోరుగా పూజా సామగ్రి విక్రయాలు

ప్యారీస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం లక్ష్మీదేవికి ఎంతో ప్రీతికరమైనది. ఈ మాసంలోని శుక్రవారాలు కూడా ప్రత్యేకమైనవి. నేడు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో మహిళలు అమ్మవార్లను ఆహ్వానించేలా ఇళ్లల్లో పూజకు సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే రాష్ట్రంలోని పలు అమ్మవారి ఆలయాలు సైతం వరలక్ష్మీ వ్రతం కోసం ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఇదిలా వుండగా, పూజలకు అవసరమైన మామిడి, అరటి తోరణాలు, పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు, నైవేద్యానికి అవసరమైన దినుసుల విక్రయాలు గురువారం జోరందుకున్నాయి. నగరంలోని కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్, కొత్వాల్ బజార్, ఫ్లవర్ బజార్, టి.నగర్ రంగనాథన్ వీధి, మైలాపూర్ కపాలేశ్వరాలయ మాడవీధులు, తిరువేర్కాడు, మాంగాడు, కుండ్రత్తూర్, అంబత్తూరు మార్కెట్ బజార్ తదితర ప్రాంతాలు పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ప్రధాని మోదీని కలుసుకున్న ఎంపీ కమల్

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని రాజ్యసభ సభ్యుడు, నటుడు కమల్ హాసన్ కలుసుకున్నారు. రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎంపికైన కమల్ హాసన్ గత నెల 25న ఎంపీగా పదవీ ప్రమాణం చేశారు. ఆయనకు పలు పార్టీల నేతలు అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో, కమల్ హాసన్ గురువారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ మేరకు కమల్ తన ఎక్స్ పేజీలో... "ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నాను. నటుడిగా, రాష్ట్ర ప్రతినిధిగా ఆయనకు పలు సమస్యలు తెలియజేశాను. వాటిలో ముఖ్యమైనది కీళడి. ప్రాచీన తమిళ భాష, తమిళ నాగరికత వైభవాన్ని ప్రపంచానికి చాటేందుకు తమిళులు చేస్తున్న కార్యక్రమాలకు మద్దతివ్వాలని ప్రధాన మంత్రిని అభ్యర్థించాను" అంటూ కమల్ హాసన్ పోస్ట్ చేశారు.


ప్రధానికి జ్ఞాపిక అందిస్తున్న కమల్ హాసన్

కరుణకు ఘన నివాళి

● మెరీనాబీచ్‌లో మౌనర్యాలీ ● రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు


ర్యాలీలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, ఎంపీలు, పార్టీ శ్రేణులు


మెరీనాబీచ్‌లో కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్టాలిన్

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఏడో వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా డీఎంకే శ్రేణులు సామాజిక సేవా కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహించారు. జిల్లా కేంద్రాల్లో నిరుపేదలకు అన్నదానాలు, ఆర్థిక సహాయాల పంపిణీ తదితర కార్యక్రమాలను చేపట్టారు. ప్రధాన వీధుల్లో కరుణానిధి ఫొటోలు ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలో కరుణ వర్ధంతిని పురస్కరించుకుని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో గురువారం ఉదయం మెరీనా బీచ్ వద్ద పార్టీ శ్రేణులతో మౌనర్యాలీ నిర్వహించారు. అన్నాసాలై ఓమందూరార్ ప్రాంగణంలోని కరుణానిధి విగ్రహ ప్రాంతం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వాలాజా రోడ్డు మీదుగా మెరీనాబీచ్ రోడ్డులో ఉన్న కరుణానిధి సమాధి వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, డీఎంకే ప్రధాన కార్యదర్శి, జల వనరుల శాఖ మంత్రి దురైమురుగన్, కోశాధికారి, ఎంపీ టీఆర్‌బాలు, మంత్రులు కేఎన్ నెహ్రూ, ఐ.పెరియసామి, ఈవీ వేలు, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, దామో అన్బరసన్, ఆవడి నాజర్, ఎంఆర్‌కే పన్నీర్ సెల్వం, సామినాథన్, ఎంపీ కనిమొళి, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, నగరానికి చెందిన డీఎంకే జిల్లా శాఖల కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై సమాధిపై పుష్పవలయాలు ఉంచి స్టాలిన్ నివాళులర్పించారు. ఆ ప్రాంతానికి చేరువలోనే ఉన్న కరుణానిధి సమాధివద్దకు వెళ్ళి ఆ ప్రాంతంలోను పుష్పవలయాలు ఉంచి నివాళులర్పించారు. ఈ ర్యాలీలో పార్టీ శ్రేణులు నల్లచొక్కాలు ధరించి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం స్టాలిన్ గోపాలపురంలో కరుణానిధి నివాసానికి వెళ్ళారు. పార్టీ ప్రముఖులతో కలిసి కరుణ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుండి బయలుదేరి తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయానికి చేరుకుని అక్కడే ఉన్న కరుణ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడి నుండి మంత్రులు, పార్టీ ప్రముఖులతో బయలుదేరి సీఐటీ నగర్‌లో ఉన్న కరుణానిధి సతీమణి రాజాత్తి అమ్మాళ్ నివాసానికి చేరుకుని, అక్కడ కరుణానిధి చిత్రపటం వద్ద స్టాలిన్, సోదరి కనిమొళి, కరుణ సతీమణి రాజాత్తి అమ్మాళ్ పుష్పాంజలి ఘటించారు.

లంక చెర నుంచి జాలర్లను విడిపించండి!

● కేంద్ర మంత్రికి సీఎం స్టాలిన్ లేఖ



చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక చెరలో ఉన్న 80 మంది తమిళ జాలర్లను విడిపించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయనకు ఓ లేఖ రాశారు. శ్రీలంక నావికాదళం తమిళ జాలర్లపై దాడులు జరపటం, అక్రమంగా నిర్బంధించి, పడవలను ఆస్తులను స్వాధీనం చేసుకోవడాన్ని ఆనవాయితీగా పెట్టుకుందని, తమ దేశపు సముద్రజలాల్లో అక్రమంగా చొరబడ్డారంటూ ఇటీవల కాలంలో 80 మంది జాలర్లను నిర్బంధించిందని తెలిపారు. బుధవారం వేకువజామున కూడా కచ్చాదీవి సమీపంలో చేపలు పడుతున్న 14 మంది జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడిచేసి, వారిని అక్రమంగా నిర్బంధించి కాంగేశన్ రేవుకు తరలించిందని, జాలర్లతోపాటు రెండు పడవలను, అందులో విలువైన వస్తువులను కూడా స్వాధీనం చేసుకుందని స్టాలిన్ తెలిపారు. శ్రీలంక నావికాదళం తమిళ జాలర్లపై దాడులు జరుపకుండా శాశ్వతమైన చర్యలు చేపట్టాలని తాను కేంద్రానికి పలుమార్లు లేఖలు రాసినా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం శ్రీలంక జైళ్లలో మగ్గుతున్న తమిళ జాలర్లను విడిపించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆ లేఖలో స్టాలిన్ కోరారు.

చెమటోడ్చి పెంచిన పార్టీని ముక్కలు చేయడం భావ్యమా?

● తనయుడిపై రాందాస్ ఆగ్రహం



చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) అనే వటవృక్షాన్ని తన చెమటతో పెంచి పోషించానని, ప్రస్తుతం తన తనయుడే ఆ వృక్షాన్ని గొడ్డలితో నరికి ముక్కలు చేయడానికి ప్రయత్నిస్తున్నాడని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఆవేదన వ్యక్తం చేశారు. దిండివనం తైలాపురం గార్డెన్‌లో గురువారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్బుమణి తన నివాసానికి వచ్చినప్పుడల్లా తల్లిని మాత్రమే పరామర్శించి వెళ్తున్నాడన్నారు. పార్టీలోని 34 విభాగాలకు చెందిన ప్రతినిధులను డబ్బుతో తన వెంట తిప్పుకుంటున్న అన్బుమణి వల్లే పార్టీలో సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. ఈ కారణంగానే యేళ్ల తరబడి తనను 'అయ్యా..!' అని వినమ్రంగా సంబోధించిన వారంతా ప్రస్తుతం అందరూ తనను 'రాందాస్' అని పేరు పెట్టి పిలిచే స్థాయికి తెచ్చిన ఘనత అన్బుమణికే దక్కిందన్నారు. కుట్రలు కుతంత్రాలు పన్నుతూ పార్టీని హస్తగతం చేసుకోవాలని అన్బుమణి తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారని, మే నెలలోనే పార్టీ అధ్యక్ష పదవి ఖాళీ అయిన విషయం కూడా ఆయనకు తెలియదని రాందాస్ అన్నారు. చెమటోడ్చి పెంచిన పీఎంకే అనే వృక్షంలోని ఓ కొమ్మ నరికి, ఆ కొమ్మకు గొడ్డలి బిగించుకుని వృక్షాన్ని సమూలంగా ముక్కలు చేసేందుకు అన్బుమణి ప్రయత్నిస్తున్నాడంటూ రాందాస్ ఆరోపించారు. తైలాపురం గార్డెన్ పీఎంకే ప్రధాన కార్యాలయమని, ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశానని, ప్రస్తుతం తాను చేస్తున్న న్యాయపోరాటంలో గెలిచి పార్టీపై పూర్తి ఆధిపత్యం సంపాదిస్తానని రాందాస్ ధీమా వ్యక్తం చేశారు. అన్బుమణి మాయమాటలకు మోసపోయి ఆయన వెంట తిరుగుతున్నవారంతా తన దగ్గరకు తిరిగిరావాలని, వారిని తల్లిలా తాను ఆదరించడానికి సిద్ధంగా ఉన్నానని రాందాస్ స్పష్టం చేశారు.

31న వినాయక విగ్రహాల నిమజ్జనం



● భద్రతా ఏర్పాట్లపై హిందూ సంస్థలతో పోలీసుల చర్చలు

ప్యారీస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మరో మూడు వారాల్లో వినాయక చవితి వేడుకల నేపథ్యంలో హిందూ సంస్థల ప్రతినిధులతో గ్రేటర్ చెన్నై పోలీసులు గురువారం చర్చలు జరిపారు. ఏసీపీలు, సంయుక్త కమిషనర్ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగరంలోని 200 వార్డుల్లో చవితి వేడుకలు నిర్వహించనున్న హిందూ సంస్థల ప్రతినిధులు హాజరయ్యా రు. గత ఏడాది జరిగిన ఉత్సవాల తీరు, హాజరైన భక్తుల సంఖ్య తదితర విషయాలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హిందూ సంస్థల ప్రతినిధులకు సూచనలిచ్చారు. ఈ నెల 27న వినాయక చవితి జరుపుకోనున్న నేపథ్యంలో, నగరంలో వేల సంఖ్యలో వినాయకుడి ప్రతిమల ఉంచి పూజలు నిర్వహించనున్నారు. ఈ సారి కూడా ఐదు రోజులు పూజల అనంతరం 31వ తేదీ విగ్రహాల నిమజ్జన ఊరేగింపు నిర్వహిస్తారు. ఉత్తర చెన్నై, మధ్య చెన్నై, దక్షిణ చెన్నై ప్రాంతాల్లో పెట్టే గణపయ్య విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేసే ప్రాంతాలను పోలీసులు ఎంపిక చేశారు. విగ్రహాల ఊరేగించేందుకు విధించిన నిబంధనలు, ఊరేగింపు మార్గాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

చవితికి గణనాథుల విగ్రహాల సిద్ధం...

పుళియాన్‌తోపు సమీపంలోని కొసపేటలో వినాయక చవితి కోసం గణనాథులు సిద్ధమవుతున్నారు. గతంతో పోలిస్తే ఇక్కడ విగ్రహాల నాణ్యత, తయారీ విధానం మెరుగు పడటంతో ఉత్సవ నిర్వాహకులు విగ్రహాలను ఇక్కడి నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్ళేందుకు ముందుగా ఆర్డర్లు కూడా ఇచ్చారు. మరో వైపు 5 అడుగుల నుంచి 10 అడుగుల ఎత్తు వరకు అందంగా రూపొందించిన లంబోదరుడి విగ్రహాలు పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. పలు రూపాల్లో వినాయక విగ్రహాలను రూపొందించడమే కాకుండా విగ్రహాలకు ఈ సారికూడా సింహ గణపతి, దర్బార్ గణపతి, సూర్య గణపతి వంటి రకరకాల పేర్లతో తయారు చేస్తున్నారు.

సమాచార ప్రతినిధులుగా

ఐఏఎస్‌ల నియామకం సబబే

● హైకోర్టు స్పష్టీకరణ
● పిటిషనర్‌కు రూ. లక్ష జరిమానా

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమాచార ప్రతినిధులుగా నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను తోసిపుచ్చిన మద్రాసు హైకోర్టు పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధించింది. ప్రభుత్వ శాఖలకు చెందిన కీలకమైన సమాచారం, పథకాల వివరాలు, సకాలంలో ప్రసారమాధ్యమాలే కాకుండా ప్రజలకు త్వరితగతిన అందించేందుకు, 'ఉంగలుడన్ స్టాలిన్' పథకం పేరుతో ప్రజల నుంచి స్వీకరించే వినతులపై సకాలంలో చర్యలు తీసుకునేందుకుగాను ప్రభుత్వ సమాచార ప్రతినిధులుగా ఐఏఎస్ అధికారులు డాక్టర్ జే రాధాకృష్ణన్, గగన్‌దీప్‌సింగ్ బేదీ, ధీరజ్‌కుమార్. పి.అముదను నియమిస్తూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జూలై 14న ఉత్తర్వు జారీ చేశారు. దానిని వ్యతిరేకిస్తూ నగరానికి చెందిన న్యాయవాది డి. సత్యకుమార్ హైకోర్టులో ప్రజాహితవాజ్యం వేశారు. ఆ పిటిషన్‌లో సక్రమంగా ప్రభుత్వ ఉత్తర్వు వివరాలను గెజిట్‌లో ప్రకటించకుండా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వ సమాచార ప్రతినిధులుగా నియమించడం చెల్లదని, ఈ నియమకాలకు చట్టపరమైన మద్దతు కూడా ఉండదని ఆరోపించారు. సమాచార ప్రతినిధుల ద్వారా అధికారపార్టీ తమకు అనుకూలమైన సమాచారాన్నే ప్రజలకు వెల్లడించేందుకు ప్రయత్నించే అవకాశం కూడా ఉందని, ఇది రాజ్యాంగానికి విరుద్ధమైందని, అందువలన ముఖ్యమంత్రి ఉత్తర్వు చెల్లదని ప్రకటించాలని కోరారు. ఈ పిటిషన్ గురువారం ఉదయం ప్రధాన న్యాయమూర్తి శ్రీవాత్సవ, న్యాయమూర్తి సుందర్ మోహన్‌తో కూడిన హైకోర్టు ప్రథమధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఐఏఎస్ అధికారులు రాజకీయ పార్టీలకు సమాచార ప్రతినిధులుగా నియమించబడలేదని, ప్రభుత్వ పాలనపరమైన సౌలభ్యం కోసమే నియమితులైనట్లు స్పష్టమవుతోందని, ప్రభుత్వ సమాచార ప్రతినిధులుగా ఐఏఎస్ అధికారులను నియమించకూడదంటూ రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనలేదని, అందువలన ఆ నలుగురు అధికారుల నియామకం చెల్లుతుందన్న హైకోర్టు ధర్మాసనం, న్యాయస్థానం సమయాన్ని వృథా చేసేలా ప్రజాహిత వాజ్యాన్ని వేసిన పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధిస్తూ ఉత్తర్వు జారీ చేసింది.

పెట్టుబడులపై సీఎం చెప్పేవన్నీ అసత్యాలే

● ఈపీఎస్ విమర్శ



ప్యారీస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి తెచ్చిన పెట్టుబడుల వ్యవహారాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పేవన్నీ అసత్యాలేనని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. ఆయన గురువారం డీఎంకే ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ తన ఎక్స్‌పేజీలో పోస్టు చేసిన వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రాన్ని సమర్థవంతంగా పరిపాలించకుండా ప్రకటనలకే పరిమితమైన డీఎంకే ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి మెరుగుపరచకుండా ప్రజలను మభ్యపెట్టేలా అసత్యాలు చెబుతోందని ఈపీఎస్ దుయ్యబట్టారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పథకాల గురించి ఆలోచించకుండా ఫొటో షూట్లు నడిపి కేంద్రప్రభుత్వ పథకాలకు సిక్కర్లు అంటించి తమవని చెప్పుకోవడంలో సీఎం నుంచి మంత్రుల వరకు అలవాటుగా మారిందని వ్యాఖ్యానించారు. మార్చి 17వ తేదీ నాటికి ఆర్థిక పురోగతిలో రాష్ట్ర వార్షికాదాయం, రాష్ట్ర అభివృద్ధి 9.12 శాతంగా గణించబడిందని, ఇది ఈ నెల 1వ తేదీ నాటికి 11.19 శాతంగా పెరిగిందని, అయితే గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పెరిగిన ఆర్థిక ప్రగతి గురించి డీఎంకే ప్రభుత్వం మాట్లాడటంలేదని ఈపీఎస్ తెలిపారు.

సమాచార దృష్టి

14 నుంచి 'వరల్డ్ కైట్ ఫెస్టివల్'

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఈ నెల 14 నుంచి 'వరల్డ్ కైట్ ఫెస్టివల్' నిర్వహించనున్నారు. 4వ వరల్డ్ కైట్ ఫెస్టివల్ ఈసీఆర్ రోడ్డు సమీపంలో 14 నుంచి 17వ తేది వరకు జరుగనుంది. ఈ వేడుకల్లో ఫ్రాన్స్, థాయ్‌లాండ్, సింగపూర్, స్విట్జర్లాండ్, మలేసియా, ఇండోనేషియా తదితర దేశాలు పాల్గొననున్నాయి. 'సముద్రపు జీవులను కాపాడుకుందాం' అనే నినాదంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో, సురా, ఆక్టోపస్, స్విట్జర్లాండ్ అలావుద్దీన్, ఇండోనేషియా డ్రాగన్, రాష్ట్ర జల్లికట్టు ఎద్దు సహా 250 రకాలు భారీ గాలిపటాలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

15న పంచాయతీల్లో గ్రామ సభలు

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేది స్వాతంత్ర్య దినోత్సవం రోజున పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనర్ పొన్నయ్య చెన్నై మినహా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు పంపించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేది ఉదయం 11 గంటలకు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. జనరల్ నిధుల నుంచి చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలు గ్రామ సభలో చెప్పి ఆమోదం పొందాలని సూచించారు.

ఊబర్ యాప్ ద్వారా మెట్రో టిక్కెట్లు

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ తరువాత 'ఊబర్ యాప్' ద్వారా మెట్రోరైలు టిక్కెట్లు పొందే నగరంగా తమిళనాడు నిలిచింది. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో, ఊబర్ యాప్ ద్వారా చెన్నై మెట్రో రైలు టిక్కెట్లు పొందవచ్చని ప్రకటించారు. ఈ యాప్ ద్వారా గురువారం నుంచి ఈ నెల 31వ తేది వరకు 50 శాతం రాయితీపై మెట్రో రైలు టిక్కెట్లు పొందవచ్చు. ఈ మేరకు ఊబర్,సీఎంఆర్ఎల్ మధ్య ఒప్పందం కుదిరిందని అధికారులు తెలిపారు.

రూ.1,000 కోట్లతో రేషన్ సరకుల కొనుగోలు

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు అక్టోబరు నుంచి డిసెంబరు వరకు అందజేసేందుకు రేషన్ సరకుల కొనుగోలుకు రూ.1,000 కోట్లు కేటాయించారు. ఈ ప్రకారం 60వేల టన్నుల కందిపప్పు, 6 కోట్ల లీటర్ల పామాయిల్, 60వేల టన్నుల చక్కెర తదితరాల కొనుగోలుకు రాష్ట్ర వినియోగదారుల వాణిజ్య సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని అధికారులు తెలిపారు.

తెలుగు కాలనీ శ్మశానవాటిక మూసివేత

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం మండలం 26వ వార్డు పరిధిలోని తెలుగు కాలనీలో ఉన్న దహనవాటిక మరమ్మతుల కారణంగా ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 15వ తేది వరకు మూసివేయనున్నారు. ఈ సమయంలో ప్రజలు సమీపంలోని మనలి మండలం ఎంజీఆర్ నగర్‌లోని దహనవాటికను వినియోగించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

జలహంబారై జలపాతంలో స్నానాలకు నిషేధం

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూర్ సమీపంలో ఏలగిరి కొండ దిగువ ప్రాంతంలో ఉన్న జలహంబారై జలపాతంలో స్నానాలకు నిషేధం విధించారు. ఏలగిరి కొండల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జలపాతంలో నీటి ఉధృతి పెరగడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా జలపాతంలో స్నానాలకు నిషేధం విధించినట్లు అటవీ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. నుంగంబాక్కం-కోడంబాక్కం హైరోడ్డు వళ్లువర్‌కోట్టం సమీపంలో ఉన్న సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో టి.నగర్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, వ్యాసర్పాడి పరిధిలో రామలింగం ఆలయం ఎదురుగా ఉన్న సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలోను శుక్రవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు


పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పొన్నేరి డివిజన్: తేరువై కండిగై మరియు సిప్కాట్, కరాడిపుదూర్, అమరంబేడు, తానిపూండి, పంచోలై, వానిమల్లి, పెరియపులియూర్, గోపాల్‌రెడ్డి కండిగై, ఎన్‌ఎం కండిగై, కన్నన్‌కోట, పుదూర్, చిన్న, పెద్ద పొమ్మాత్తికుళం

కొరట్టూర్: కొరట్టూర్ నార్త్, శ్రీనివాసపురం, ఎన్ఆర్ఎస్ రోడ్డు, మేట్టు వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, పల్ల వీధి, లేక్ వ్యూ గార్డన్, టీవీఎస్ నగర్, సంతోష్ నగర్, అన్నై నగర్, అలియన్స్ ఆర్చిడ్ స్ప్రింగ్, లక్ష్మీ పురం, అయ్యప్ప నగర్, సెంథిల్ నగర్ 1 నుంచి 17 వీధులు, తిల్లై నగర్.

● వరలక్ష్మీ వ్రతం ఎఫెక్ట్...

రెండింతలు పెరిగిన పూల ధరలు



పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో పూల ధరలు రెండింతలు పెరిగాయి. వర్షాల కారణంగా కోయంబేడు మార్కెట్‌కు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న పూల దిగుమతులు తగ్గి ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో, శుక్రవారం వరలక్ష్మి వ్రతం కారణంగా పూల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. మల్లెలు కిలో రూ.500 నుంచి రూ.1,000, ఐస్ మల్లి రూ.400 నుంచి రూ.800, జాజిమల్లి రూ.400 నుంచి రూ.800, కనకాంబరాలు రూ.800 నుంచి రూ.1,000, ఆరళి పూలు రూ.300 నుంచి రూ.600, చామంతులు రూ.200 నుంచి రూ.240, సంపంగి రూ.100 నుంచి రూ.200, చాక్లెట్ రోజ్ రూ.160 నుంచి రూ.240, కలువ పూవు రూ.5 నుంచి రూ.50, తాళంబులు రూ.50 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. ఈ విషయమై పూల వ్యాపారుల సంఘం ఉపాధ్యక్షుడు ముత్తురాజ్ మాట్లాడుతూ... గురువారం పెరిగిన ధరలు ఆదివారం వరకు కొనసాగే అవకాశముందని తెలిపారు.

పాఠశాలల్లోనే ఆధార్ బయోమెట్రిక్ నమోదు

● 15 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి



పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలల్లో 5 నుంచి ఏడేళ్లలోపున్న 8 లక్షల మంది విద్యార్థులు, 15 నుంచి 17 ఏళ్లలోపున్న 7 లక్షల మంది అ మొత్తం 15 లక్షల మంది విద్యార్థులకు తపాలా శాఖ ద్వారా ఆధార్ బయోమెట్రిక్ నమోదు చేపట్టేందుకు అనుమతించారు. దీనికోసం పాఠశాల విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి పి.చంద్రమోహన్ జీవో విడుదల చేశారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ విద్యార్థుల సంక్షేమార్థం 1 నుంచి ప్లస్ టూ తరగతుల విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యాభ్యాసం కొనసాగించేలా ఉపకార, ప్రోత్సాహక వేతనాలు అందజేస్తోంది. ఉపకారవేతనాలను విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోనే జమచేస్తుంటారు. విద్యార్థులు బ్యాంక్ ఖాతాలు ప్రారంభించాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి.

15 లక్షల మంది విద్యార్థులకు...

పాఠశాల విద్యాశాఖలో 5 నుంచి 16 ఏళ్లలోపున్న విద్యార్థులు, 1వ తరగతి నుంచి ప్లస్ టూ వరకు చదువుతున్నారు. వారిలో 5 నుంచి ఏడేళ్లలోపున్న వారు తొలిసారిగా తప్పనిసరిగా బయోమెట్రిక్ వివరాలు నమోదుచేయాల్సి ఉంది. అలాగే, 15 నుంచి 17 ఏళ్లలోపున్న వారు రెండోసారి బయోమెట్రిక్ నమోదుచేయాల్సి ఉంది. మొత్తం 15 లక్షల మంది విద్యార్థులకు తప్పనిసరిగా బయోమెట్రిక్ వివరాలు నమోదుచేయాలి. గత ఏడాది నుంచి తపాలా శాఖ పాఠశాలల్లోనే శిబిరాలు ఏర్పాటుచేసి పొదుపు ఖాతాలు ప్రారంభిస్తోంది.. ప్రస్తుతం తపాలా శాఖ ఆధార్ బయోమెట్రిక్ నమోదు కూడా చేపట్టనుంది. ఆ ప్రకారం, ఈ నెల నుంచి డిసెంబరులోగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో రెండు విడతగా ఆధార్ బయోమెట్రిక్ వివరాల నమోదు పూర్తిచేయాలని నిర్ణయించినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

ప్రజా సమస్యల పరిష్కారమే డీఎంప ప్రభుత్వ లక్ష్యం



ఉంగళుడన్ స్టాలిన్ కార్యక్రమంలో పళ్లిపట్టు మండల డీఎంకే నేతలు, అధికారులు

తిరుత్తణి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వంలో ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారమవుతున్నాయని మండల డీఎంకే అధ్యక్షుడు తిరుమలై లోగనాథన్ పేర్కొన్నారు. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు యూనియన్ పరిధిలోని కేశవరాజుకుప్పంలో గురువారం ఉదయం 'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమాన్ని డీఎంకే జిల్లా నేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల అధ్యక్షుడు తిరుమలై లోగనాథన్, డీఎంకే పట్టణ కార్యదర్శి, న్యాయవాది సీజే సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు. తహసీల్దార్ భారతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల వద్ద వినతిపత్రాలను అందుకుని, సకాలంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణాభివృద్ధి అధికారులు అర్పుదరాజ్, సెల్వం, ఆర్‌వి రవికుమార్, డీఎంకే నిర్వాహకులు అన్బు, దండిపాణి, యూత్ ఆర్గనైజర్ ఎస్‌ఏ నిఖిల్, సెంగయ్య, వేలుమలై, దివాకర్, కుమార్ సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలి

● తమిళనాడు ఎస్సీ,ఎస్టీ ఫెడరేషన్ డిమాండ్



సీఎస్ మురుగానందంతో తమిళనాడు ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ నాయకులు


ప్యారీస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ,ఎస్టీలకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ఆలిండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎస్సీ,ఎస్టీ-తమిళనాడు విభాగం రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కరుప్పయ్య నేతృత్వంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ సి.తమిళ్ సెల్వం, ఇ.త్యాగరాజన్, కార్మిక సంఘ నాయకులు ముత్తయ్య, ఇరుదయనాథన్, పి.సతీష్‌బాబు, జనార్ధనన్ తదితరులు బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందంను కలిసి రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. అందులో రెవెన్యూశాఖలో 923 మంది డీటీల నియామకంలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని కోరారు. వాటిని పరిశీలించి పరిష్కరింపజేస్తామని సీఎస్ హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నిర్వాహకులు తెలిపారు.

నలుగురు ఐపీఎస్ అధికారులపై క్రమశిక్షణా చర్యలు

● డీజీపీకి హైకోర్టు ఆదేశం

పెరంబూర్, ఆగసు 7 (ఆంధ్రజ్యోతి): కేసు ముగింపునకు సంబంధించి దిగువకోర్టులో సకాలంలో నివేదిక దాఖలుచేయడంలో విఫలమైన నలుగురు ఐపీఎస్ అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని మద్రాసు హైకోర్టు రాష్ట్ర డీజీపీకి ఉత్తర్వు జారీ చేసింది. కడలూరు జిల్లా కుల్లంచావిడి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో తుది నివేదిక దాఖలుచేసేలా సంబంధిత పోలీసులకు ఉత్తర్వులివ్వాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్ న్యాయమూర్తి పి.వేల్ మురుగన్ ఎదుట విచారణకు వచ్చినప్పుడు కుల్లంచావిడి పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి తుది నివేదిక సమర్పించినట్లు పోలీసు శాఖ తరపున హాజరైన న్యాయవాది తెలిపారు. న్యాయమూర్తి స్పందిస్తూ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసు ముక్తాయింపునకు సంబంధించి తుది నివేదికను కేసు విచారణ జరిగిన కోర్టులో సమర్పించాలని, అదే సమయంలో ఫిర్యాదుదారుడికి ఆ సమాచారం తెలియజేయాల్సి ఉంటుందని, ఇవన్నీ సక్రమంగా నిర్వర్తించకుండా నిర్లక్ష్యం చేసినట్టు తెలుస్తోందని, కనుక కేసు ముక్తాయింపు జరిగిన 2017 నుండి ఇప్పటివరకూ కుల్లంచావిడి పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసిన 11 మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు. ఈ వ్యవహారంలో తుది నివేదిక న్యాయస్థానంలో సమర్పించారా లేదా అని పరిశీలించని ఎస్పీలపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. 2015 నుండి ఇప్పటి వరకూ కడలూరు జిల్లా ఎస్పీలుగా పనిచేసిన ఐపీఎస్ అధికారులు పి.శరవణన్, ఎం.శ్రీఅభినవ్, ఎస్.శక్తి గణేశన్, ఎస్.జయకుమార్, ప్రస్తుతం తంజావూరు డీఎస్పీగా పనిచేస్తున్న రాజారామ్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి ఉత్తర్వు జారీ చేశారు. ప్రజల ఫిర్యాదులపై విచారణ జరిపి, చార్జిషీటు సమర్పించడం, లేదా ఆ ఫిర్యాదుపై ఇరుపక్షాల మధ్య జరిగిన చర్చల పర్యవసానంలో ముక్తాయింపు పలికినట్లు తెలియజేసే తుదినివేదికను, ఆయా కేసులను విచారించే కోర్టుల్లో దాఖలు చేయడం తప్పనిసరి అని, దీనికి సంబంధించి ఉత్తర్వులను పోలీసుశాఖ ఉన్నతాధికారులకు నాలుగు వారాల్లోగా జారీ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు.

ఎరువు కలిసిన నీళ్లు తాగి గుర్రాల మృతి



అందియూరు సంతలో మృతి చెందిన గుర్రాలు

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అందియూరు సంతలో అమ్మకానికి తీసుకొచ్చిన ఆరు గుర్రాలు ఎరువు కలిసిన నీళ్లు తాగి మృతి చెందాయి. ఈరోడ్ జిల్లా అందియూరు గురునాథస్వామి ఆలయ వేడుకలు ఈ నెల 13 నుండి 16 వరకు జరుగనున్నాయి. ఆ వేడుకలను పురస్కరించుకుని ఆలయం వద్ద గుర్రాల సంత, పశువుల సంత జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో జరిగే గుర్రాల సంత అంతర్జాతీయంగా ఖ్యాతిగడించింది. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుండి ఈ సంతలో విక్రయించే మేలి రకం గుర్రాలను కొనేందుకు వ్యాపారులు వస్తుంటారు. ఆ మేరకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన సైజా అనే వ్యక్తి ఈ సంతలో విక్రయించడానికి 24 గుర్రాలను తీసుకొచ్చాడు. ఆ గుర్రాల వద్ద ఫైరస్ అనే వ్యక్తిని కాపలాగా ఉంచారు. బుధవారం రాత్రి అతను ఆ ప్రాంతానికి చేరువగా ఉన్న తోట నుండి బకెట్‌లో నీటిని తీసుకువచ్చాడు. ఆ బకెట్‌లో ఎరువు ఉన్న విషయాన్ని గమనించకుండా అతడు నీటిని గుర్రాలున్న చోటుకు తెచ్చాడు. ముందుగా ఆరు గుర్రాలు ఆ నీటిని తాగి ప్రాణాలు కోల్పాయి. అయితే అందియూరు సంత ప్రారంభం కాకముందే ఆరుగుర్రాలు మృతి చెందటం పట్ల వ్యాపారులంతా ఆందోళన చెందుతున్నారు.

నేడు తిరుత్తణిలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుత్తణి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి పరిసర ప్రాంతాల్లోని విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తిరువళ్లూరు జిల్లా విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో తిరుత్తణి నగరం, ఆకూర్, పొన్పడి, మాధూరు, మురుక్కంపట్టు, కార్తికేయపురం, సరస్వతినగర్, పెరియ కదంబూరు, చిన్న కదంబూరు, వినాయగపురం, శ్రీనివాసపురం, వేలంచేరి, కాశీనాధపురం, చత్రంజేయపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

డీఎస్పీ డిస్మిస్ ఉత్తర్వులు రద్దు చేసిన హైకోర్టు

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కోటకుప్పం డీఎస్పీ సునీల్‌ను డిస్మిస్ చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై మద్రాసు హైకోర్టు ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం స్టే విధించింది. అంతరానితనం కేసులో చర్యలు చేపట్టని సునీల్‌ను డిస్మిస్ చేయాలని సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం తేని జిల్లా డీఎస్పీగా పనిచేస్తున్న సునీల్ సింగిల్ జడ్జి ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలుచేశారు.

నేటినుంచి పంద్రాగస్టు రిహార్సల్స్

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రిదళాలు, పోలీసులు, విద్యార్థులు నిర్వహించే మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల రిహార్సల్స్ శుక్రవారం, 11, 13వ తేదీల్లో జరుగనున్నాయి. రిహార్సల్స్ సందర్భంగా మెరీనా బీచ్ సమీపంలో ఉదయం 6 గంటల నుంచి రిహార్సల్స్ ముగిసే వరకు ట్రాఫిక్ మార్పులు చేపట్టినట్లు నగర ట్రాఫిక్ పోలీసులు విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. ● కార్మిక స్మారక స్థూపం నుంచి రిజర్వ్ బ్యాంక్ సబ్ వే వరకు వెళ్లే కామరాజర్ రోడ్డు, రాజాజీ రోడ్డు, ఫ్లాగ్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు నిషేధం విధించారు. ● కామరాజర్ రోడ్డు నుంచి రాజాజీ రోడ్డు మీదుగా ప్యారీస్ వైపు వెళ్లే అన్ని వాహనాలు కార్మిక స్మారక స్థూపం నుంచి వాలాజా రోడ్డు, అన్నాసాలై, ముత్తుస్వామి బ్రిడ్జి మీదుగా ప్యారీస్ చేరుకోవాలి. ● అన్నాసాలై నుంచి ప్యారీస్ వైపు వెళ్లే వాహనాలు ముత్తుస్వామి బ్రిడ్జి, ముత్తుస్వామి రోడ్డు, రాజాఅన్నామలై మండ్రం, నార్త్ ఫోర్ట్ సైడ్ రోడ్డు మీదుగా ప్యారీస్ చేరుకోవాలి. ● రాజాజీ రోడ్డు నుంచి కామరాజర్ రోడ్డు వైపు, ప్యారీస్, నార్త్ ఫోర్ట్ సైడ్ రోడ్డు, ముత్తుస్వామి రోడ్డు, ముత్తుస్వామి బ్రిడ్జి, అన్నాసాలై, వాలాజా రోడ్డు మీదుగా కామరాజర్ రోడ్డు చేరుకోవాలి.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం జరుగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ వెల్లడించింది. ఆ ప్రకారం, తిరువొత్తియూర్ మండలం 7వ వార్డు క్లాస్ ఫ్యాక్టరీ రోడ్డులోని కేజీ వర్షిణి అవెన్యూ, మాధవరం మండలం 28వ వార్డు ఎంఆర్‌హెచ్ రోడ్డులోని సెబాస్టియన్ ఆలయం, అంబత్తూర్ మండలం 85వ వార్డు చెన్నై-తిరువళ్లూర్ రహదారి కేఎస్‌ఆర్‌నగర్‌లోని శ్యామ్ హాలు, కోడంబాక్కం మండలం 128వ వార్డు విరుగంబాక్కం కామరాజర్ రోడ్డులోని కమ్యూనిటీ హాలు, వలసరవాక్కం మండలం 154వ వార్డు రామాపురం శాంతి నగర్ సాయ్ ఉదయం మహల్, ఆలందూర్ మండలం 163వ వార్డు ఆదంబాక్కం న్యూ కాలనీ మెయిన్ రోడ్డులోని లక్ష్మి కల్యాణ మండపం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్న శిబిరాల్లో ప్రజలు పాల్గొని వినతి పత్రాలు సమర్పించవచ్చని జీసీసీ తెలిపింది.

12 వరకు ఎంబీబీఎస్ తొలివిడత కౌన్సెలింగ్

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు ఈ నెల 13న సీట్ల కేటాయింపు, తుది జాబితా 14వ తేది విడుదల కానుంది. ఈ మేరకు వైద్య విద్య డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల అడ్మిషన్‌కు సంబంధించిన తొలివిడత కౌన్సెలింగ్ http://tnmedicalselection.netఅనే వెబ్‌సైట్‌లో గత నెల 30వ తేది ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. ఈ నెల 4వ తేదీతో ముగిసిన కౌన్సెలింగ్ గడువు ఈ నెల 12వ తేది సాయంత్రం 5 గంటల వరకు పొడిగించారు. కళాశాల మార్చుకోవాలనే విద్యార్థులు ఈ అవకాశం వినియోగించుకోవచ్చు. ఈ నెల 13న సీట్ల కేటాయింపు నిర్వహించి, తుది జాబితా 14వ తేది విడుదల చేయనున్నారు. కళాశాల కేటాయింపు పత్రాలను ఈ నెల 14 నుంచి 22వ తేది మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులు పొందవచ్చని వైద్య విద్య డైరెక్టరేట్ తెలిపింది.

విద్యుత్ స్కూటర్‌కు రూ.20 వేల సబ్సిడీ

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో వస్తువులు డెలివరీ చేసే ఉద్యోగులు విద్యుత్ స్కూటర్లు కొనుగోలుకు రూ.20వేల సబ్సిడీ అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.ఈమేరకు కార్మిక సంక్షేమం, వృత్తి నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి వీరరాఘవరావు జీవో విడుదల చేశారు. రాష్ట్ర శాసనసభలో మార్చి 14న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో... ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగిందని, వస్తువులు డెలివరీ చేయడం ద్వారా ఉపాధి పొందుతున్న వారి సంఖ్య కూడా పెరిగిందన్నారు. వారి సంక్షేమార్థం ఆన్‌లైన్ స్వయం ఉపాధి కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేశామన్నారు. ఈ బోర్డులో సభ్యులుగా నమోదుచేసుకున్న కార్మికులు 2,000 మందికి కొత్తగా విద్యుత్ స్కూటర్ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు సబ్సిడీగా ఇవ్వనుందని తెలిపారు. ఈ పథకానికి రూ.4 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని జీవోలో పేర్కొన్నారు.

మూడో విడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల ఆన్‌లైన్ కౌన్సెలింగ్ మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తొలివిడత కౌన్సెలింగ్ జూలై 14 నుంచి 16వ తేది వరకు, రెండో విడత జూలై 26 నుంచి 28వ తేది వరకు నిర్వహించారు. మూడవ విడత కౌన్సెలింగ్ గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. కటాఫ్ మార్కులు 143 నుంచి 77.500 వరకు పొందిన విద్యార్థులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. 12వ తేది ఉదయం 10 గంటల్లోపు కళాశాలల తుది కేటాయింపు ఉత్తర్వులు అందజేయనున్నారు. అనంతరం ట్యూషన్ ఫీజు చెల్లింపు, ఒరిజినల్ సర్టిఫికెట్ల సమర్పణ తదితర ప్రక్రియ పూర్తిచేసి, 17వ తేది సాయంత్రం 5 గంటల్లోపు కేటాయించిన కళాశాలలో చేరాలని అన్నా విశ్వవిద్యాలయం తెలియజేసింది.

వరకట్నం వేధింపులకు బలైన అబల

● భర్త, అత్తామామల అరెస్ట్



ఆత్మహత్యకు పాల్పడిన ప్రీతి పెళ్లినాటి చిత్రం

ప్యారీస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మెట్టినింటిలో వరకట్నం వేధింపులతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తిరుప్పూర్ వాసులను ఆందోళనకు గురిచేసింది. తిరుప్పూర్ చెట్టిపాళయంకు చెందిన పారిశ్రామికవేత్త కుప్పుస్వామి-సుగంధి దంపతుల కుమార్తె ప్రీతి (26)కి ఈరోడ్ జిల్లా వీరప్పన్ సత్రంకు చెందివన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చత్తీశ్వర్ (30)తో 11 నెలల క్రితం వివాహమైంది. వరకట్నంగా ప్రీతి తల్లిదండ్రులు 150 సవర్ల నగలు, లగ్జరీ కారు, రూ.25లక్షల నగదు ఇచ్చి కుమార్తెకు ఇచ్చి పంపించినట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని ప్రీతి నుంచి తీసుకున్న భర్త అదనంగా మరో రూ.50 లక్షలు తీసుకురావాలంటూ ప్రతిరోజు ఆమెను చిత్రహింసలకు గురిచేసేవాడు. దీంతో ఈ నెల 1న ఈరోడ్ నుంచి బయలుదేరిన ప్రీతి, తిరుప్పూర్‌లో ఉన్న తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ప్రీతికి ఫోన్ చేసిన చత్తీశ్వర్ కుటుంబ సభ్యులు వరకట్నం తీసుకురమ్మని తరచూ బెదిరించడంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై ప్రీతి తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రీతి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, విచారణ చేపట్టిన నల్లూరు పోలీసులు చత్తీశ్వర్, అతడి తల్లిదండ్రులు విజయ్‌కుమార్, విమలను గురువారం అరెస్టు చేశారు.

మీనంబాక్కం ఫ్లై ఓవర్ పైనుంచి దూకి ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం ఫ్లై ఓవర్ నుంచి దూకి ఐటీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్రోంపేటకు చెందిన బాలాజి (39) నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం దుకాణానికి వెళ్తున్నానని చెప్పి, త్రిశూలం-మీనంబాక్కం ఫ్లై ఓవర్ వద్దకు వచ్చాడు. 40 అడుగుల ఎత్తున్న ఫ్లై ఓవర్ నుంచి కిందకు దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రగాయాలతో ఉన్న బాలాజీని చుట్టుపక్కల వారు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక మృతిచెందాడు. ఈ ఘటనపై మీనంబాక్కం పోలీసులు కేసు నమోదుచేసి, బాలాజీ ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు.

లంచం కేసులో ఇద్దరు వీఏఓల అరెస్ట్

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దిండుగల్, కాంచీపురం జిల్లాల్లో పట్టా మార్పుకోసం లంచం ఆశించిన ఇద్దరు వీఏఓలు కటకటాలపాలయ్యారు. దిండుగల్ జిల్లా అయ్యంపాళయం వీఏఓగా రమేష్ (47) పనిచేస్తున్నాడు. అయ్యంపాళయానికి చెందిన కార్తికేయన్ తన భూమి సర్వే చేసి, పేరు మార్పుతో టైటిల్ డీడ్ కోసం వీఏఓ రమేష్‌కు దరఖాస్తు ఇచ్చాడు. అందుకు రూ.3 వేలు లంచం కోరిన రమేష్ లంచం ఇవ్వని కారణంగా మూడు సార్లు దరఖాస్తు తోసిపుచ్చినట్లు సమాచారం. అనంతరం రూ.2,500 ఇస్తానని వీఏఓకు తెలిపిన కార్తికేయన్, ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనలతో రసాయనాలు పూసిన నోట్లకు కార్తికేయన్ వీఏఓకు అందజేస్తుండగా, అక్కడే మాటువేసిన ఏసీబీ డీఎస్పీ నాగరాజన్ బృందం రమేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కాంచీపురం... : కాంచీపురం జిల్లా తండలంలో రవిరాజ్ అనే వ్యక్తి పట్టా కోసం వీఏఓ రాబర్ట్ రాజ్‌ను సంప్రదించాడు. అందుకు రూ.80 వేలు లంచం కోరడంతో, రూ.30 వేలు ఇస్తానని ఒప్పందం చేసుకుని, ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వీఏవోకు రవిరాజ్ నగదు అందిస్తుండగా, ఏసీబీ అధికారులు అతనిని అరెస్ట్ చేశారు.

బాలికకు లైంగిక వేధింపులు

● ఆటో డ్రైవర్ సహా ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆటో డ్రైవర్ సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మేలకొడయూర్ ప్రాంతానికి చెందిన బాలిక అనారోగ్యానికి గురికావడంతో, బాలిక తల్లి ఆమెను ప్రశ్నించింది. కొద్దిరోజులుగా కొందరు తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని బాలిక చెప్పడంతో, తల్లి దిగ్భ్రాంతి చెందింది. దీంతో ఏం జరిగిందోనని తల్లి ఆరాతీయగా బాలికను పాఠశాలకు ఆటోలో తీసుకెళ్తున్న మాదేష్ (37), బాలిక బంధువు సురేష్ (45), నైజీముద్దీన్ మే నెల నుంచి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కుంభకోణం మహిళా పోలీసులు కేసు నమోదుచేసి, ఆటో డ్రైవర్ మాదేష్ సహా ముగ్గురిని అరెస్ట్ చేశారు.

45 ఏళ్లు దాటిన మహిళా పోలీసులకు నైట్ డ్యూటీ నుంచి మినహాయింపు

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నలభై ఐదేళ్లు దాటిన మహిళా పోలీసులకు నైట్ డ్యూటీ నుంచి మినహాయింపు కల్పిస్తూ గ్రేటర్ చెన్నై నగర పోలీస్ కమిషనర్ ఎ.అరుణ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... నగర పోలీసు కమిషనరేట్‌లో 45, అంతకు మించి వయస్సున్న సీఐలు, ఎస్‌ఐలు, స్పెషల్ ఎస్‌ఐలు, హెచ్‌సీలు అంకితభావంతో పనిచేస్తున్న విషయం పరిగణలోకి తీసుకుని రాత్రి విధుల నుంచి మినహాయింపు కల్పించామని, ఈ ఉత్తర్వులను అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు పాటించాలని ఉత్తర్వుల్లో తెలియజేశారు.

డివైడర్‌ను ఢీకొన్న మినీ లారీ

● పురోహితుడి కుటుంబ సభ్యులకు గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న మినీ లారీ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

ఏర్పేడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఓ మినీ లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో పురోహితుడి కుటుంబసభ్యులకు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు..

గుంటూరుకు చెందిన లక్ష్మీనరసింహ శర్మ కొంతకాలంగా తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు ఆలయం కన్యకాపరమేశ్వరి ఆలయంలో పురోహితుడుగా పనిచేస్తూ అక్కడే కాపురం ఉంటున్నాడు. 15రోజుల క్రితం తన సోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అంత్యక్రియలు, కర్మక్రియలు కార్యక్రమాలకు గుంటూరు వచ్చాడు. కార్యక్రమాలను ముగించుకుని తిరిగి బుధవారం రాత్రి ఇంటి సామాన్లతో మినీ లారీలో వేసుకుని భార్య, బిడ్డలతో బయలుదేరాడు. మార్గమధ్యమైన ఏర్పేడు మండలం అంజిమేడు సమీపంలో పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిపై గురువారం ఉదయం అదుపు తప్పిన లారీ డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీనరసింహశర్మ (38)తో పాటు భార్య విశాలి(33), కుమారుడు చాణిక్య(7), కుమార్తె శృతి(5)కి గాయాలయ్యాయి. చాణుక్యకు తీవ్రగాయాలు కావడంతో వారిని 108లో బాలాజీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చాణిక్య అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఎలాంటి పోలీసు కేసు నమోదు కాలేదు. ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాన్ని పోలీసులు ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.



'వానరన్'లో ఓ దృశ్యం

నేడు 'వానరన్' విడుదల

ఆరెంజ్ పిక్చర్స్ పతాకంపై రాజేష్ పద్మనాభన్, సుజాత సంయుక్తంగా నిర్మించిన 'వానరన్' మూవీ శుక్రవారం విడుదలకానుంది. శ్రీరామ్ పద్మనాభన్ ఈ చిత్రానికి స్టోరీ, స్క్రీన్‌ప్లే సమకూర్చి, దర్శకత్వం వహించారు. అలనాటి ప్రముఖ హాస్య నటుడు దివంగత నాగేష్ మనవడు బ్రిజేష్ నాగేష్ హీరోగా, అక్షయ హీరోయిన్‌గా నటించారు. ఇతర పాత్రల్లో లొల్లు సభ జీవా, దీపా శంకర్, ఆదేష్ బాలా, నాంజిల్ విజయన్, ఎస్ఎల్.బాలాజీ, బేబీ వర్ష, వెంకట్‌రాజ్, శివగురు, రామ్‌రాజ్‌తో పాటు పలువురు వీధి నాటక కళాకారులు నటించారు. పగటి పూట ఆంజనేయస్వామి వేషాధారణ చేసే కళాకారుల జీవితాలను నేపథ్యంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో బ్రిజేష్ నాగేష్.. హనుమంతుడిగా నటించారు. అదేవిధంగా తండ్రీకూతుళ్ళ అనుబంధాన్ని చెప్పేలా స్క్రీన్‌ప్లే సాగుతుందని దర్శకుడు శ్రీరామ్ అంటున్నారు. ఇప్పటికే ఈ చిత్రాన్ని చూసిన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారని, ఖచ్చితంగా ప్రేక్షకులు కూడా ఆదరిస్తారన్న నమ్మకం ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

హాస్యభరిత చిత్రంగా 'సొట్ట సొట్ట ననైయుదు'

చిత్రజ్యోతి

నూతన దర్శకుడు నవీద్ ఫరీద్ రూపొందించిన 'సొట్ట సొట్ట ననైయుదు' ఆహ్లాదభరిత పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందించారు. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. దీన్ని పురస్కరించుకుని ఆ చిత్ర ఆడియో, ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. అడ్లెర్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రంలో నిషాంత్ రూషో, వర్షిణి, షాలిని జంటగా నటించగా, 2కే జనరేషన్‌ను ఆలరించేలా రూపొందించారు. ఈ చిత్ర ఆడియో రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. ఇందులో దర్శకులు తమిళ్, నెల్సన్ వెంకటేశన్, సిబి చక్రవర్తి, ప్రశాంత్ పాండియరాజ్, నిర్మాత ధనం జయన్, నటులు ఆర్‌కే సురేష్, బాలశరవణన్, నితిన్ సత్య తదితరులు హాజరై ఆడియో విడుదల చేశారు. ఇందులో చిత్ర దర్శకుడు మాట్లాడుతూ, 'ఈ సినిమాను పది రోజుల్లో పూర్తి చేయాలని భావించినా 18 రోజుల్లో పూర్తిచేశాం. హీరోగా నటించేందుకు నిషాంత్ ఓకే చెప్పిన తర్వాతే ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్ళాం. హీరోయిన్ షాలినికి మంచి భవిష్యత్ ఉంది. నేటి యువతరం ఎంజాయ్ చేసేలా, పూర్తి హస్యభరిత చిత్రంగా తెరకెక్కించాం. పైగా ఇది నాకు తొలిసినిమా, మీడియాతో సపోర్టు చేయాలని కోరారు. హీరో నిషాంత్ మాట్లాడుతూ, 'ఇది నాకు ఐదో ప్రాజెక్టు, ఒక మంచి కంటెంట్‌తో మీ ముందుకు వస్తున్నాం. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ ఎంతగానో కష్టపడ్డారంటూ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' తెలిపారు.



'సొట్ట సొట్ట ననైయుదు' ఆడియో రిలీజ్ దృశ్యం

బరువు తగ్గేందుకు 'మౌంజారో' వాడలేదు

● ఖుష్బూ



బరువు తగ్గించుకునేందుకు 'మౌంజారో' ఇంజెక్షన్ వేయించుకుంటున్నట్టు జరుగుతున్న ప్రచారంపై సినీ నటి ఖుష్బూ ఘాటుగా స్పందించారు. తన బరువు తగ్గడం వెనుక ఎలాంటి ముందులుగానీ, ఇంజెక్షన్లుగానీ లేవని తేల్చి చెప్పారు. క్రమ శిక్షణ, నిలకడ, సంకల్పంతోనే తాను బరువు తగ్గానని, అడ్డదారులను నమ్మొద్దని ఆమె పేర్కొన్నారు. తాజాగా ఆకుపచ్చ రంగు సీక్విన్ డ్రెస్‌లో మెరిసిపోతున్న తన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. వాటిని చూసిన నెటిజన్లు ఖుష్బూ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై ప్రశంసలు కురిపించారు. అదేసమయంలో మరికొందరు మాత్రం.. ఇదంతా మౌంజారో ఇంజెక్షన్ మహిమ, ఈ విషయం మీ ఫాలోవర్లకు కూడా చెప్పండి వాళ్ళు కూడా తీసుకుంటారు' అంటూ కామెంట్స్ చేశారు. వీటిపై ఆమె స్పందించారు. 'నా బరువు తగ్గేందుకు ఎలాంటి మందులు లేదా ఇంజెక్షన్లు ఉపయోగించలేదు. ప్రతి రోజూ ఉదయం గంటపాటు వర్కౌట్ చేస్తాను. సాయంత్రం 40-50 నిమిషాలు నడుస్తాను. ఒక వేళ సాయంత్రం నడక కుదరకపోతే ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున వర్కౌట్ చేస్తాను. సరైన ఆహార నియమాలు పాటించడం కూడా తన విజయానికి ఒక కారణం' అని పేర్కొన్నారు.

అలనాటి నటి ఎంఎన్ రాజమ్ ఇంటికి సీఎం

అలనాటి నటి ఎం.ఎన్.రాజమ్ కోరికను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దంపతులు తీర్చారు. ఈ నెల 5న తన 90వ జన్మదిన వేడుకలు జరుపుకున్న ఎంఎన్ రాజమ్ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను గతంలో ఎన్నోమార్లు చూశానని, అయితే సీఎం అయ్యాక ఆయనను చూడలేకపోయానన్నారు. ముఖ్యమంత్రి హోదా లో స్టాలిన్‌ను చూడాలనే కోరిక ఇంకా నెరవేరలేదని అన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి స్టాలిన్ దృష్టికి వెళ్లడంతో బుధవారం రాత్రి అడయారు, కామరాజర్ అవెన్యూలోని ఎంఎన్ రాజమ్ నివాసానికి వెళ్ళిన స్టాలిన్ దంపతులు ఆమెకు జన్మదిన శుభాంకాక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం దపంతులకు ఆమె ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎన్ రాజమ్ 1950 నుంచి 60 వరకు ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో ఆమె నటించారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సంభాషణలు సమకూర్చిన పలు చిత్రాలలోనే ఆమె నటించి ఖ్యాతి గడించారు.



ఎంఎన్ రాజమ్‌తో సీఎం దంపతులు

ఆధ్యాత్మికం

ఆరోగ్య ప్రదాయని.. మహా ప్రత్యంగిరా దేవి

● శత్రుభయాలను తొలగించే ప్రత్యంగిరాలయం ● భక్తులు, పర్యాటకులను ఆకట్టుకునే దివ్య క్షేత్రం




ప్రత్యంగిరా దేవి



మహ ప్రత్యంగిరా దేవి గర్భాలయం

రాజధాని నగరం చెన్నైలో షోళింగనల్లూరు వద్ద రెసిడెన్షియల్ భవన సముదాయాల నడుమ, బకింగ్‌హామ్ తీరంలో ఉన్న మహా ప్రత్యంగిరా దేవి ఆలయం ఇటు భక్తులను, అటు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.. ఈ ఆలయాన్ని దర్శించడానికి దేశ విదేశాల నుండి భక్తులు రావటం విశేషం. దేశంలో 1998 వరకూ అథర్వణ వేద కాళి ఆలయాన్ని నిర్మించడానికి ఎవరూ సాహించలేదు. ఆచార్య ప్రత్యంగిరా స్వామి వాస్తు శాస్త్ర ప్రకారం ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో వేర్వేరు సన్నిధుల్లో శైవ, వైష్ణవులు ఆరాధించే దేవతామూర్తులంతా కొలువుదీరారు. ప్రత్యేకించి శత్రుభయాలను తొలగించి, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే దివ్యక్షేత్రంగా ఈ ఆలయానికి పేరుంది.


- టి.నగర్, ఆంధ్రజ్యోతి



శ్రీ ఐశ్వర్య ఈశ్వరర్



భద్రకాళి



ఆలయ ప్రవేశద్వారం



శివాలయం


ప్రత్యంగిరా దేవి పురాణ గాథ...

పురాణాల ప్రకారం మహా విష్ణువు తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించడానికి నరసింహావతారం దాల్చి హిరణ్యకశపుడిని సంహరించిన తర్వాత స్వామివారి ఆగ్రహం తగ్గలేదు. ప్రహ్లాదుడు నరసింహుడి కోపాన్ని శాంతింపజేయడంతో మహా విష్ణువు తన నిజరూపంతో వైకుంఠాన్ని చేరుకుంటారు. శైవ సంప్రదాయం ప్రకారం హిరణ్యకశపుడిని వధించిన తర్వాత నరసింహస్వామి ఆగ్రహం కారణంగా భూమండలం అల్లకల్లోలమైంది. దేవతలు, ఋషులు తమను కాపాడమని పరమేశ్వరుడిని వేడుకున్నారు. ఆయన పార్వతీదేవిని ప్రత్యంగిరా దేవి రూపంలో పంపారు. ఆ ప్రత్యంగిరా దేవి నరసింహస్వామిని శాంతిపజేసి, మళ్లీ ఆయన సాత్వికమైన రూపం దాల్చేలా చేశారు. కాగా ఈ దైవ కార్యక్రమం కోసం పరమేశ్వరుడు రూపొందించిన శరభేశ్వరుడి రూపంలో రెక్కల వైపు దర్శనమిస్తున్న పార్వతీదేవి రూపమే ప్రత్యంగిరా దేవి. ఈ పురాణగాథ ప్రస్తావన 'కుంజితాంగిరి స్తవం' అనే ప్రాచీన గ్రంథంలో ఉమాపతి శివాచార్యులు వివరించారు.

అమ్మవారి ప్రథమక్షేత్రం...

పత్యంగిరా సిద్ధర్ పీఠం ట్రస్టును ఆచార్య ప్రత్యంగిరా స్వామి 1998లో స్థాపించారు. మహా ప్రత్యంగిరా దేవి కోసం ఆ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం ప్రత్యంగిరా దేవి కోసం నిర్మించిన మొట్టమొదటి ఆలయం వాస్తు శాస్త్రం ప్రకారం షోళింగనల్లూరులో అత్యద్భుతంగా నిర్మించారు. 1999 ఆగస్టు 22న మహా కుంభాభిషేకం కూడా జరిగింది. ప్రతియేటా ఆంగ్ల సంవత్సరాది రోజున ఈ ఆలయాన్ని లక్షలాది మంది భక్తులు సందర్శిస్తున్నారని రికార్డులు చెబుతున్నాయి. ఈ క్షేత్ర నాయకి మహా ప్రత్యంగిరా దేవి మహాత్మ్యం గురించి ఆలయాన్ని నిర్మించిన స్వామి నాలుగు ఆధ్యాత్మిక గ్రంథాలను రచించి ప్రచురించారు.

ఆలయ విశేషాలు...



వరాహి అమ్మవారు

ఈ ఆలయం తూర్పుముఖంగా నిర్మించగా, ఉత్తరం వైపు ప్రవేశద్వారం ఉంది. ఈ ప్రవేశద్వారం రెండంతస్తుల రాజగోపురం కేరళ శిల్పకళా శైలిలో నిర్మించారు. వారాహి అమ్మవారి సన్నిధి ఉత్తర ద్వారం సమీపంలో ఉంది. ఆలయంలోని వారాహి అమ్మవారు, ప్రత్యంగిరా దేవి చుట్టూ ఉపసన్నిధుల్లో పలు దేవతా మూర్తులున్నారు. మంత్ర వారాహి అమ్మవారు, ఆకర్షణ శరభేశ్వరస్వామి, చాముండ భద్రకాళి తదితర సన్నిధులున్నాయి. సింహముఖం కలిగిన ప్రత్యంగిరా దేవి సుఖాసనంలో తన కుడిపాదాన్ని సింహంపై ఉంచి, ఉగ్ర రూపంలో ఉంటారు.. కుడి చేతిలో శూలాయుధం ధరించి ఉంటుంది. ప్రత్యంగిరా దేవిని దర్శిస్తే జీవితంలో ఎదురయ్యే అన్ని అడ్డంకులు, భయాలు తొలగిపోతాయని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. ఆలయంలో నిత్యపూజలతోపాటు నవరాత్రి వేడుకలు, ఓనం పండుగ వేడుకలు ఘనంగా జరుగుతాయి.

ఎలా వెళ్లాలి..



బకింగ్‌హామ్ కాలువ ఒడ్డున, నివాసాల మధ్య ఆలయం

పాత మహాబలిపురం, కొత్త మహాబలిపురం రహదారుల నడుమ బకింగ్‌హామ్ కాలువ ఒడ్డున ఉంది. నగరం నలుమూలల నుండి షోళింగనల్లూరుకు సిటీ బస్సులు నడుపుతున్నారు. పాత మహాబలిపురం రోడ్డులోని షోళింగనల్లూరు జంక్షన్ నుండి కిలోమీటర్ దూరంలో ఈ ఆలయాన్ని చేరుకోవచ్చు. ప్రతి రోజూ ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు ఈ ఆలయాన్ని తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.





వళ్లువర్‌కోట్టమ్‌లో గురువారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి వర్ధంతి సందర్భంగా ఏర్పాటైన సంగీత కార్యక్రమాన్ని తిలకిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు

ఎస్‌కేపీసీలో రక్షా బంధన్ వేడుకలు



రక్షా బంధన్ కార్యక్రమానికి కరస్పాండెంట్ అతిథులను ఆహ్వానిస్తున్న దృశ్యం

ప్యారీస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)లో రక్షా బంధన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని హిందీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు ఆసక్తిగా పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరి శరత్‌కుమార్‌తో పాటు వచ్చిన ప్రముఖులు కళాశాలలో పనిచేస్తున్న పురుషుల చేతికి రాఖీలు కట్టారు. రక్షా బంధన్‌ను ఆహ్వానిస్తూ సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు ఆటపాటలతో సందడి చేశారు.. చివరగా వేడుకల్లో పాల్గొన్న వారికి మిఠాయిలు పంపిణీ చేశారు. రాఖీల తయారీ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.



తేనాంపేట జోన్ లాయిడ్స్‌కాలనీ ఐటీఐ కళాశాలలో గురువారం ఉదయం జరిగిన 'ఉంగలుడన్ స్టాలిన్' శిబిరంలో స్థానికుల నుండి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

దివ్య ఔషధం...కొబ్బరి నీరు

● శక్తి కోకో ప్రొడక్ట్స్ వ్యవస్థాపకులు సీఎం కామరాజ్



సంస్థ ఉత్పత్తులు పరిచయం చేస్తున్న కామరాజ్

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): టెంకాయ నీరు పలు రోగాలకు దివ్య ఔషధంలా పనిచేస్తుందనే విషయం పరిశోధనల్లో తెలిసిందని శక్తి కోకో ప్రొడక్ట్స్ వ్యవస్థాపకులు సీఎం కామరాజ్ తెలిపారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పొల్లాచ్చి కేంద్రంగా 1981లో ప్రారంభించిన తమ సంస్థ, టెంకాయ, టెంకాయ నీరు వినియోగించి పలు ఉత్పత్తులు చేస్తున్నామని, తమ ఉత్పత్తులు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నట్టు తెలిపారు. టెంకాయ పొడి, చక్కెర టెంకాయ పాలు, క్రీమ్, కొబ్బరి పాలు, పండ్ల రసాలు తదితరాలు టెంకాయ నీరుతో కలసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఏడాది పాటు వినియోగించుకొనేలా తయారుచేస్తున్నామన్నారు. ప్రపంచంలో ఏ దేశం కనుగొనలేని కొబ్బరి నీరు నుంచి 'కోకో హీల్' అనే పదార్థం మంటలతో ఏర్పడే గాయాలు, దీర్ఘకాలంగా శరీరంపై ఉండే పుండ్లు తదితరాలు తగ్గించే మందులో వినియోగిస్తున్నారన్నారు. ఈ మందు వినియోగంతో మధుమేహ వ్యాధిగ్రస్తులకు కాళ్లు, చేతులు తొలగించే అవసరం ఉండదని, త్వరలో ప్రభుత్వాసుపత్రుల్లో కూడా ఈ మందు అందించేలా చర్యలు జరుపుతున్నట్లు కామరాజ్ తెలిపారు.

కేసరి పాఠశాలలో 'ఫ్యాషన్ డిజైనింగ్ ల్యాబ్'



ప్రారంభోత్సవంలో ఫౌండేషన్ నిర్వాహకులు, పాఠశాల యాజమాన్యం

పెరంబూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో ముంబైకి చెందిన సమతా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ 'ఫ్యాషన్ డిజైనింగ్ ల్యాబ్' ఏర్పాటుచేసింది. పాఠశాల ప్రాంగణంలో గురువారం ఉదయం జరిగిన ప్రారంభ కార్యక్రమానికి పాఠశాల కార్యదర్శి కేఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షత వహించగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ ముంబైకి చెందిన స్వచ్ఛంద సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా కేసరి పాఠశాలకు 20 కుట్టుమిషన్లు అందజేసిందని, ఈ సౌకర్యాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ... ముంబైకి చెందిన సమతా ఫౌండేషన్ విద్యార్థినులకు ఫ్యాషన్ డిజైనింగ్‌లో తర్ఫీదు ఇచ్చి, వారి నైపుణ్యం మెరుగుపరిచి, భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందే విధంగా ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. అందులో భాగంగా 20 కుట్టు మిషన్లతో కూడి ల్యాబ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చేనేత ప్రదర్శన

● ప్రారంభించిన తిరునల్వేలి కలెక్టర్ సుకుమార్



చేనేత ప్రదర్శన పరిశీలిస్తున్న కలెక్టర్ సుకుమార్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి కలెక్టరేట్‌లో 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక చేనేత ప్రదర్శనను జిల్లా కలెక్టర్ సుకుమార్ గురువారం ప్రారంభించారు. చేనేత పరిశ్రమలో 75యేళ్లకు పైగా ఉత్తమ సేవలందిస్తున్న మూడు చేనేత సహకార సంఘాల సభ్యులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేసి సత్కరించారు. అనంతరం కేంద్రప్రభుత్వ ముద్ర పథకం కింద ప్రభుత్వ రాయితీ, వడ్డీ రాయితీతో ఏడుగురు సహకారం సంఘ సభ్యులకు రూ.6 లక్షలు, నేత కార్మికులకు ఇళ్ల పంపిణీ పథకం కింద 11 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు, మరో ఐదుగురికి నేత మగ్గాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో తిరునల్వేలి జౌళి పరిశ్రమ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఆరోగ్య రాజ్,ఆ శాఖ అధికారులు, చేనేత సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కన్నియాకుమారిలో జాలర్ల సమ్మె



కన్నియాకుమారి చిన్నముట్టం రేవు వద్ద నిలిపిఉంచిన పడవలు

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో గురువారం ఉదయం జాలర్లు సమ్మెకు దిగారు. కన్నియాకుమారి పెరియనాయకి వీధి వద్ద సముద్రంలో జాలర్లు సురక్షితంగా చేపలవేట సాగించేందుకు నిర్మించిన కొక్కీ వలయాకారపు వంతెన పొడవు పెంచాలని డిమాండ్ చేస్తూ సుమారు ఐదువేల మంది జాలర్లు సమ్మెకు దిగారు. జాలర్లు చేపలవేటకు వెళ్ళకపోవటంతో కన్నియాకుమారి తీరం పూర్తిగా బోసిపోయింది. మార్కెట్‌లో చేపల ధరలు పెరిగాయి.

ఆస్తుల రిజిస్ట్రేషన్లలో అవకతవకలొద్దు

● అధికారులకు మంత్రి ఆదేశం



అవినాశిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి మూర్తి

ప్యారీస్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లలో అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులశాఖ మంత్రి పి.మూర్తి ఆ శాఖ అధికారులకు ఆదేశించారు. తిరుప్పూర్ జిల్లా అవినాశిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఉదయం మంత్రి మూర్తి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మంత్రి అధికారులు, ఉద్యోగులకు ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి పలు సూచనలిచ్చారు. భూములు, భవనాల రిజిస్ట్రేషన్ ప్రస్తుత మార్కెట్ రేట్లను బట్టి ఎలాంటి మార్పులు లేకుండా పారదర్శకంగా జరగాలని, ప్రభుత్వానికి నష్టం రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పాత భవనాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునరుద్ధరణకు అవసరమైన నిధులు కేటాయించామన్న మంత్రి అద్దె భవనాల్లో పనిచేస్తున్న కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించడంపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ముహూర్తం రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మామూలు రోజుల కంటే అధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయని, అందువల్ల ముందుగానే టోకెట్లు పంపిణీ చేసి రద్దీ సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి మూర్తి తెలిపారు.


కె.శ్రీనివాస్‌కు నేడు
కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారం



ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు, ఉపన్యాసకులు, సామాజిక సాహిత్య విశ్లేషకులు డాక్టర్ కె.శ్రీనివాస్‌కు కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని నేడు ప్రదానం చేయనున్నట్లు రచయిత పలమనేరు బాలాజి ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు సమీపం మదనపల్లె రహదారిలోని లయన్స్‌క్లబ్ వేదికగా శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఆయనకు జ్ఞాపికతో పాటు రూ.25వేలను అందజేయడం జరుగుతుందన్నారు. జర్నలిస్టుగా నాలుగు దశాబ్దాలకు పైగా కె.శ్రీనివాస్ రాసిన కథనాలు, సంపాదకీయాలు, చేసిన ఇంటర్వ్యూలు, సమకాలీన ప్రపంచ చరిత్రను కొత్తకోణంలో చూపిస్తాయన్నారు. తెల్లారని తెలంగాణ, బుల్డోజర్ సందర్భాలు, శ్రీనివాస్ సంపాదకీయాలు, తెలంగాణలో సాహిత్య వికాసం, జూన్ 2, అనేక సందర్భాలు, కొత్త వంతెన, సంభాషణ.... ఇలా తెలుగు ప్రపంచానికి అవసరమైన అన్ని సందర్భాలలో విలువైన ఎన్నో పుస్తకాలను ఆయన వెలువరించారన్నారు.తాపీ ధర్మారావు స్మారక పురస్కారం, సి.వై. చింతామణి అవార్డు, ఎన్.ఆర్. చందూర్ అవార్డు, డి. శ్రీపాదరావు అవార్డు, మాదల వీరభద్రరావు స్మారక పురస్కారం, దేవులపల్లి రామానుజ రావు స్మారక సాహిత్య పురస్కారం,ముప్పా పద్మావతి రంగయ్య పురస్కారం,అరుణ్ సాగర్ విశిష్ట పాత్రికేయ పురస్కారం, ప్రపంచ తెలుగు సమాఖ్య వారి బీఎస్ఆర్ కృష్ణ స్మారక పురస్కారం-2016.. మొదలైన పురస్కారా లను తన రచనలకు కె. శ్రీనివాస్ ఇదివరకు పొందారని ఆయన వివరించారు.

- గంగవరం, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,144

తలనీలాలు సమర్పించినవారు: 28,889

ఒంపులు తిరుగుతూ సాగే ఏరు.. నిశ్చలంగా నీళ్లు.. ఏటికి అటూఇటూ ఒత్తుగా పెరిగిన మడచెట్లు.. వాలుతూ ఎగురుతూ పక్షులు.. ఏటినీటిలో పడవలు.. వలలు విసురుతూ మత్స్యకారులు.. కేరళ తరహా అందమైన దృశ్యం తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలో కనిపిస్తుంది. కండలేరు క్రీక్‌గా పిలిచే ఈ ఉప్పుటేరు జీవ వైవిధ్యానికి, మత్స్యకారుల జీవనోపాధికి నెలవు. పర్యాటకులకు కనువిందు. కాకపోతే అందుకు తగిన ఏర్పాట్లను ప్రభుత్వం ఈ ప్రాంతంలో చేయాల్సి ఉంది.

- గూడూరు, ఆంధ్రజ్యోతి





ఉప్పుటేరులో గిరిజనుల చేపల వేట



కండలేరు ఏరియల్ వ్యూ



వేటకోసం పడవలు

36 కిలోమీటర్లు విస్తరించిన కండలేరు క్రీక్

గుమ్మళదిబ్బ సముద్ర ముఖద్వారం నుంచి తిప్పగుంటపాళెం వరకు 36 కిలోమీటర్ల వెనుకకు సముద్రపు ఉప్పునీరు ప్రవహిస్తుంది. అదే సమయంలో వెంకటగిరి కైవల్యానది నుంచి వచ్చే మంచినీటి ప్రవాహం గూడూరు మీదుగా చల్లకాలువ, పంబలేరుకు చేరుతుంది. గూడూరు మండలంలోని మిట్టాత్మకూరు ప్రాంతాల నుంచీ, రాపూరు కండలేరు జలాశయం నుంచీ వచ్చే జలాలు పంబలేరువాగుకు చేరుకుంటాయి. ఇవి మనుబోలు మండలం వెంకన్నపాళెం గ్రామం గుండా ప్రవహిస్తాయి. వీటికి మనుబోలు మీదుగా వచ్చే వరదనీరు కూడా జత అయ్యి చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం వద్ద ఉన్న కండలేరుక్రీక్‌లో కలుస్తాయి. ఇక్కడ ఒక చెక్‌డ్యాంను నిర్మించారు. ఈ చెక్‌డ్యాం వరకు అటు ఉప్పునీరు (బ్యాక్‌వాటర్) వస్తుంది. ఇటు మంచినీరు ఈ చెక్‌డ్యామ్‌ను దాటుకుని కండలేరు క్రీక్‌లోకి ప్రవహిస్తోంది. ఈ క్రీక్ ద్వారా గుమ్మళ్లదిబ్బ ప్రాంతంలోని సముద్రంలో జలాలు కలుస్తాయి. దీంతో కండలేరు క్రీక్ ఉప్పుటేరుగా ప్రసిద్ధి చెందింది.

ఉప్పుటేరు ప్రత్యేకత ఇదీ..

కండలేరు ఉప్పుటేరు ప్రత్యేకత ఏమిటంటే ఇటు మంచి నీరూ, అటు ఉప్పునీరూ కలవడం. సముద్రంలో లాగా లవణశాతం ఎక్కువ ఉండదు. మధ్యస్తంగా 10 పీపీటీ నుంచి 30 పీపీటీ లోపు మాత్రమే ఈ ఏటిలో ఉంటుంది. దీంతో చేపలు, రొయ్యలు, పీతలు సమృద్ధిగా పెరుగుతాయి. ఈ జలాలు మడ అడవుల పెరుగుదలకు దోహదపడుతాయి. అందుకే ఉప్పుటేరు వెంబడి మడ అడవులు విస్తరించి ఉంటాయి. ఇవి తీరప్రాంతాల కోతను నిలువరిస్తుంటాయి. చేపలు, రొయ్యలు వదిలే లార్వాలు(గుడ్లు) నీటి ప్రవాహంలో కొట్టుకు పోకుండా మడ చెట్లకు చుట్టుకుని ఉంటాయి. అక్కడే పిగిలి, చేపలు, రొయ్యల వృద్ధికి దోహదపడతాయి. ఈ తరహా ముఖద్వారాలు మన దేశంలోని సుందర్బన్ (పశ్చిమ బెంగాల్), గోదావరి (ఆంధ్రప్రదేశ్), కావేరి (తమిళనాడు), మండోవి (గోవా) ప్రాంతాలలో ఉన్నాయి.

అపార మత్స్య సంపద

ఈ క్రీక్‌వెంబడి తిప్పగుంటపాళెం, చేడిమాల, బెస్తపాళెం, అంకులపాటూరు, రామారెడ్డిపాళెం, ఏరూరు, మోమిడి, వరగలి, లింగవరం, తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ గ్రామాలున్నాయి. ఈ ప్రాంతంలోని మత్స్యకారులు పడవల్లో ఈ క్రీక్ ద్వారానే గుమ్మళదిబ్బ సమీపంలోని సముద్రంలోకి వేటకు వెళతుంటారు. తీర గ్రామాల్లోని గిరిజనులు మాత్రం ఉప్పుటేరులోనే చేపలు, రొయ్యలను పట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఉప్పుటేరులో రొయ్యలు, పీతలతో పాటు కోడివాయ, వంజరం, చందువ రకం చేపలు దొరుకుతుంటాయి. దీంతోపాటూ క్రీక్ వెంబడి సుమారు రెండు వేల ఎకరాలకు పైగా రొయ్యల చెరువులు ఏర్పడ్డాయి. ఇక్కడ పెరిగే రొయ్యలను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేస్తుంటారు.



మడ అడవులు



ఉప్పుటేరు వెంబడి సాగవుతున్న రొయ్యల చెరువులు



తిప్పగుంటపాళెం చెక్‌డ్యాం



కండలేరు ఉప్పుటేరు

డక్కిలి జడ్పీటీసీ రాజేశ్వరి మృతి



కలిమిలి రాజేశ్వరి (ఫైల్‌ఫొటో)

డక్కిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డక్కిలి జడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి(42) గురువారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. ఆమె మృతదేహాన్ని వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కాలేజీ సమీపంలో ఉన్న స్వగృహంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. శుక్రవారం ఉదయం ఆమె స్వగ్రామమైన డక్కిలి మండలం చాపలపల్లి గ్రామానికి తీసుకెళ్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. సీనియర్ నేత కలిమిలి రాంప్రసాద్ రెడ్డి సతీమణి అయిన రాజేశ్వరి 2013లో చాపలపల్లి పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా గెలుపొందారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. తన భర్త రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో మండలానికి ఒక్కో అంబులెన్సు సొంత డబ్బుతో కొనుగోలు చేసి ప్రజల సౌకర్యార్థం వినియోగించారు. చాపలపల్లిలో రామాలయం నిర్మించడంతో పాటు గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు.

కొయ్యబొమ్మల శిక్షణా శిబిరం

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో గల కళాసృష్టి కార్యాలయంలో ఢిల్లీకి చెందిన చేనేత జౌళిశాఖ సహకారంతో రెండు నెలలపాటు కొయ్యబొమ్మల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాసృష్టి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ గుమ్మడిపూడి దశరథాచారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణకు కొయ్యబొమ్మల కళాకారులు మాత్రమే అర్హులని గుర్తుచేశారు. అభ్యర్థులకు చేనేత జౌళిశాఖ నుంచి గుర్తింపు పొందిన హస్తకళల కార్డు ఉండాలని తెలియజేశారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో జీతభత్యాలు అందజేస్తామని వివరించారు. చేనేత జౌళిశాఖ సర్టిఫికెట్లు ఇస్తారని వెల్లడించారు. ఆసక్తి గల కళాకారులు పట్టణంలోని కార్యాలయంలో దరఖాస్తులను పొందవచ్చని తెలియజేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ
ముగ్గురికి తీవ్రగాయాలు







ప్రమాదంలో గాయపడ్డ యువకులు

కేవీబీపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మఠం గ్రామం వద్ద గురువారం రాత్రి 9 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఒక వ్యక్తి నింద్ర మండలం కావనూరుకు చెందిన వారుగా తెలిసింది. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108లో శ్రీకాళహస్తిలోని ఆస్పత్రికి తరలించారు ఎస్‌ఐ, పోలీసులు వెళ్లే సరికే అక్కడి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అంటున్నారు. పోలీసులు మాత్రం సంఘటనస్థలంలో ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్, ఏఎస్‌ఐ ఇమాన్యుయేల్ తెలిపారు.

నేడు అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

● ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ ● వ్రతానికి 500 టిక్కెట్ల జారీ







భక్తురాలికి వ్రతం టికెట్ అందజేస్తున్న డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ - వరలక్ష్మి వ్రతం కోసం బారులు తీరిన భక్తులు - సిద్ధమైన ఆస్థాన మండపం

తిరుచానూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వైభవంగా వరలక్ష్మి వ్రతం నిర్వహించడానికి టీటీడీ అన్ని ఏర్పాట్లూ చేసింది. ఆస్థానమండపం వేదికగా జరిగే వ్రతానికి గంట ముందుగా టిక్కెట్లు పొందిన భక్తులను అనుమతించనున్నట్లు విజిలెన్సు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్, కరెంటు బుకింగ్, సిఫార్సు లెటర్ల ద్వారా 500 టిక్కెట్లు విక్రయించనున్నారు. వ్రతంలో వెయ్యి మంది పాల్గొనే అవకాశం ఉంది. ఉదయం అమ్మవారికి వస్త్రాలంకరణ సేవ మినహా అన్ని ఆర్జిత సేవలను రద్దుచేసినట్లు టీటీడీ తెలియజేసింది. సర్వదర్శనంలోనే అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. గేట్ నెంబరు 4(పాతపోలీస్‌స్టేషన్) నుంచి భక్తులను అనుమతించనున్నారు. ఇందుకోసం అక్కడ జర్మన్‌షెడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం మాడవీధుల్లో పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు మాడవీధులు, ఆస్థాన మండపాలన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలంకరణ చేశారు. గురువారం ఉదయం కుంకుమార్చన కౌంటర్‌లో 150 వ్రతం టిక్కెట్లను టీటీడీ అధికారులు విక్రయించారు. అరగంట వ్యవధిలోనే టిక్కెట్లు అయిపోయాయి. టిక్కెట్లు దొరకని భక్తులు నిరాశగా వెనుదిరిగారు.

చేనేతకు ప్రభుత్వం చేయూత



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వెంకటగిరిలోని పద్మశాలి కల్యాణ మండపంలో గురువారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో నేటి నుంచి చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూం కార్మికులకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తోందన్నారు. జిల్లాలో దాదాపు 29 ప్రాథమిక చేనేత సహకార సంఘాలుండగా వెంకటగిరిలోనే ఏడు సంఘాలు చురుగ్గా పనిచేస్తున్నాయన్నారు. 42వేల మందికి చేనేత కార్మికులకు రూ. 41లక్షల మేర రుణాలు మంజూరు చేశామన్నారు. జాతీయ స్థాయి ఎగ్జిబిషన్లలతో వెంకటగిరి చేనేత ఉత్పత్తులు తమదైన ముద్ర వేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రాంతానికి చెందిన లక్కా శ్రీనివాసులు సంత్‌కబీర్ పురస్కారం అందుకోవడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ చేనేతల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామన్నారు. అనంతరం రూ.60లక్షల మేర ముద్ర వీవర్స్ చెక్కును అందజేశారు. హ్యాండ్లూం ఏడీ రమేష్, ఎల్‌డీఎం గుంటూర్ రవికుమార్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేష్ డైరెక్టర్ గంగాధర్, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, లక్ష్మీపతి, సత్యనారాయణ, పులికల్లు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల డిష్యూం.. డిష్యూం..








నాయుడుపేట/తడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో గురువారం జరిగిన సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా గురువారం ఓజిలి మండల తెలుగు తమ్ముళ్లు ఘర్షణ పడ్డారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్ ఎదుటే గొడవకు దిగారు. ఓజిలి మండల అధ్యక్ష స్థానానికి గున్నం మధుసూదనరెడ్డి, బి.విజయకుమార్ నాయుడు, కంకణాల సత్యవరప్రసాద్‌రావు, పాడి వెంకటసుబ్బయ్య పోటీలో నిలిచారు. మధుసూదనరెడ్డికే అధ్యక్ష పదవి ఇవ్వాలంటూ యల్లా సుధాకర్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు చెప్పగా.. విజయకుమార్ నాయుడు వర్గం వ్యతిరేకించింది. పార్టీ కోసం కష్టపడి, కేసులు పెట్టించుకున్నామని, మధ్యలో వలసొచ్చిన నాయకులకు ఆ పదవి ఇవ్వరాదంటూ అభ్యంతరం చెప్పడంతో ఘర్షణ మొదలైంది. ఒకరినొకరు తిట్టుకుంటూ, తోసుకుంటూ, కొట్టుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ఈ ఘర్షణకు తెరపడింది. పెళ్లకూరు, నాయుడుపేట, నాయుడుపేట రూరల్ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపికలో భాగంగా పోటీ పడే నాయకుల వివరాల సేకరణ ప్రశాంతంగా జరిగింది.

మద్యం తాగి విధులకు హాజరైన టీచర్ అంకయ్య సస్పెన్షన్

తిరుపతి(విద్య),ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లెమండలం జయంపు ప్రాథమిక పాఠశాలలో సెకండరీగ్రేడ్ టీచర్ చిన్న అంకయ్య సస్పెండయ్యారు. రోజూ మద్యం తాగి విధులకు హాజరవుతుండడం.. 4,5తరగతుల విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం పేర్కొన్నారు.ఎంఈవో ప్రాథమిక విచారణ జరిపి నివేదించారన్నారు. ఈక్రమంలోనే చిన్న అంకయ్యను సస్పెండ్ చేశామని ఒక ప్రకటనలో వివరించారు.

శ్రీకాళహస్తిలోనూ సర్వం సిద్ధం





బ్రహ్మగుడి ఆలయం వద్ద ఏర్పాట్లు - పసుపు, కుంకుమ తదితరాలను సిద్ధం చేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాహస్తీశ్వరాలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్రతం జరగనుంది. వ్రతంలో పాల్గొనే మహిళలకు ఇచ్చే వాయినాలను అధికారులు, సిబ్బంది సిద్ధం చేస్తున్నారు.

తిరుపతిలో ఎస్టీ విద్యార్థులకు రీజనల్ స్టడీ సర్కిల్

తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు హాజరయ్యే గిరిజన విద్యార్థులకు శుభవార్త. వీరి కోసం ఏపీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో తిరుపతిలో రీజనల్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకానుంది. ఇందుకు ప్రభుత్వం అనుమతించింది. గతేడాది ఆగస్టులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈక్రమంలోనే విజయవాడతోపాటు తిరుపతిలో రీజనల్ సెంటర్ల ఏర్పాటుకు గురువారం ప్రభుత్వం గురువారంఉత్తర్వులు జారీ చేసింది. వీటి నిర్వహణకు రూ. 4.22 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముదావత్ .నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుమలలో రేపు శ్రావణ పౌర్ణమి గరుడసేవ

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా తిరుమలలో శనివారం గరుడసేవ నిర్వహించనున్నారు. శ్రీమలయప్పస్వామి గరుడునిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. సెప్టెంబరు 24న మొదలయ్యే బ్రహ్మోత్సవాల్లో 28న గరుడసేవ ఉంటుంది. దీనికి ట్రయల్‌రన్‌గా శనివారం గరుడసేవను భావిస్తారు. లోటుపాట్లను గుర్తించి బ్రహ్మోత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.